క్లుప్తంగా

హరీశ్‌రావు క్రిస్మస్ శుభాకాంక్షలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని క్రైస్తవులకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఆదివారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా పండగ జరుపుకోవాలన్నారు. క్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. ఏసుక్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరికి ఉండాలని ఆకాంక్షించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్‌ను అప్పగిస్తున్న పోలీసులు

హుస్నాబాద్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించారు. మండలంలోని కూచనపల్లికి చెందిన నిమ్మకంటి దీపక్ ఫోన్ కొన్ని రోజుల కింద పోగా హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన టెక్నాలజీ ద్వారా వెబ్‌సైట్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను ఎంటర్ చేసి బ్లాక్ చేశారు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేయగా వెబ్‌సైట్ ద్వారా అతడి వివరాలతో కూడిన సమాచారం రాగానే పోలీసులు ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం బాధితుడికి ఫోన్ అప్పగించారు.

వైభవంగా సరస్వతీ యజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బెక్కల్ ఆర్యవైశ్య సత్రంలో బుస్సా బాలయ్య ఆధ్వర్యంలో ఆదివారం 485వ సరస్వతీ యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి గణపతిపూజ, స్వస్తి వాచనము, కలశ స్థాపనం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఇమామ్ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. చర్చి పాస్టర్‌తో కలిసి కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లపాటు అన్నివర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి చెందుతుందన్నారు. క్రైస్తవులందరూ పండగను కుటుంబ సభ్యులతో ఘనంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ మైనార్టీ అధ్యక్షుడు మజార్ మాలిక్, సిద్దిపేట పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, సిద్దిపేట పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాశాద్, నజ్జు, ఆయుబ్, సలీం, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి రిమాండ్

చేర్యాల(సిద్దిపేట): దుర్గమ్మ గుడిలో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి స్థానిక దుర్గమ్మ గుడిలో జరిగిన చోరీ కేసు విచారణలో భాగంగా సమీపంలోని పలు సీసీ కెమెరాలను పరిశీలించగా, లభించిన ఆధారాల ప్రకారం పట్టణ కేంద్రానికి చెందిన కమలాపురం శ్రావణ్ అనే వ్యక్తి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించామన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

ఆత్మీయ సమ్మేళనం



దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 2008–2009 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను గుర్తు చేసుకున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



మద్దూరు మండలంలోని రేబర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో కలుసుకొని గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులను సత్కరించారు. - మద్దూరు(హుస్నాబాద్)

సండే.. సందడి



చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్‌పై ఆదివారం సందడి నెలకొంది. రిజర్వాయర్‌ను చూడడానికి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తరలివచ్చి రిజర్వాయర్‌ను తిలకించి కట్టపై సందడి చేశారు. - చిన్నకోడూరు(సిద్దిపేట)

'శ్వేతపత్రాలతో కాలయాపన వద్దు'

గజ్వేల్: అధికార, ప్రతిపక్షాలు శ్వేతపత్రాల పేరిట కాలయాపన చేయడం మానుకోవాలని, ప్రభుత్వ పథకాలు వేగంగా అమలు చేయడంపై దృష్టి పెట్టాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్వేతపత్రాల రచ్చ కొనసాగుతుందని చెప్పారు. ప్రభుత్వ పథకాల్లో అవినీతికి పాల్పడిన వారిపై కూడా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు



దివ్యాంగులతో రోటరీక్లబ్ ప్రతినిధులు

ములుగు(గజ్వేల్): రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని గజ్వేల్ క్లబ్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులకు రోటరీ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్లను అమర్చేందుకు గానూ ఆదివారం హన్మకొండలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కారణాలతో అవయవాలు కోల్పోయిన వారికి క్లబ్ చేయూతనందిస్తూ ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేస్తోందని తెలిపారు. ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న క్లబ్ సేవలు గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు విస్తరింపజేసేలా సభ్యుల సహకారంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్, సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృత్తిక మహోత్సవం



సుబ్రహ్మణ్యేశ్వరుని దివ్యమంగళ రూపం

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధమైన వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రం ఆదివారం కృత్తిక నక్షత్ర మహోత్సవ వేడుకలతో అలరారింది. సుబ్రహ్మణ్యేశ్వరుని జన్మనక్షత్రం సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి పర్యవేక్షణలో వేదపండితులు తెల్లవారుజామున కృత్తిక మహోత్సవ వేడుకలకు అంకురార్పణ చేశారు. గర్భగుడిలో మూలవిరాట్టుకు లక్ష సుబ్రహ్మణ్యనామాలు పఠిస్తూ విశేషాభిషేకం జరిపారు. అనంతరం శ్రీవల్లీ దేవసేన సమేతులైన స్వామివారిని పట్టువస్త్రాలు, సకలాభరణాలు, పూలమాలికలతో కమనీయంగా అలంకరించారు. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఉత్సవ వేడుకలు తిలకించి తరించారు.

ఏసయ్య పండుగకు ముస్తాబు

విద్యుత్ దీపాలతో చర్చిల అలంకరణ

క్రిస్మస్ వేడుకలకు చర్చిలన్నీ ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. సోమవారం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. చర్చిల ఆవరణలో పశువుల పాక, స్టార్, ఏసు జననం వంటి కళాకృతులను అందంగా అలంకరించారు.



మిరుదొడ్డి: రుస్తుం ఆవిష్కరించిన ఏసుక్రీస్తు చిత్రం



విద్యుత్ వెలుగుల్లో గజ్వేల్‌లోని బాలయేసు క్షేత్రం



గజ్వేల్‌లో..



దుబ్బాక: వేడుకలకు ముస్తాబైన చర్చి

రింగ్ రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కౌన్సిలర్లు, నాయకులు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కొత్తగా రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టే ప్రాంతాలను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. పట్టణ శివారులోని చేర్వాపూర్ రుషివనం నుంచి ధర్మాజీపేట, లచ్చపేట, చీకోడ్ రోడ్డు సాయి సమర్థ ఆశ్రమం మీదుగా మల్లాయపల్లి వరకు.. అక్కడి నుంచి చెల్లాపూర్ మీదుగా దుంపలపల్లి వరకు, అక్కడి నుంచి రుషివనం హబ్షీపూర్ ప్రధాన రహదారి వరకు రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు కౌన్సిలర్లు తెలిపారు. జనవరి 15వ తేదీలోగా రింగ్‌రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆస యాదగిరి, ఇల్లందుల శ్రీనివాస్, బత్తుల స్వామి, కనకయ్య, కో ఆప్షన్ మెంబర్ ఆస స్వామి, బీఆర్ఎస్ నాయకులు గన్నె భూంరెడ్డి, బాలకిషన్‌గౌడ్, ఎల్లం, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రయ్య, శ్రీకాంత్, వెంకటస్వామిగౌడ్, మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ దిలీప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

కొండపాక(గజ్వేల్): రక్తదానం.. మరొకరికి ప్రాణదానంతో సమానమని సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహదేవ్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో ఉషోదయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైస్కూల్ ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది రక్తదానం చేయగా.. హైదరాబాద్‌కు చెందిన తలసేమియా సికిల్ సెల్ సొసైటీ సహకారం అందించింది. ఈసందర్భంగా మహదేవ్‌గౌడ్ మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో రక్తం అవసరం ఉన్న వారికి రక్తదాన శిబిరం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉషోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చిలుముల రవి, తాడూరి చక్రవర్తి, ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

అదృశ్యం



అక్కన్నపేట(హుస్నాబాద్): తన తండ్రి కనిపించడం లేదంటూ గౌరవెల్లి పరిధిలోని కొత్తకాలనీకి చెందిన బైరి భాస్కర్ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాండ్ర వివేక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తకాలనీకు చెందిన బైరి వెంకటయ్య (55) ఈనెల 22వ తేదీన ఇంటి నుంచి మధ్యాహ్నం హుస్నాబాద్‌కు వెళ్లాడు. మళ్లీ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఎవరికైనా కనిపించినా, తెలిసిన 8985406309, 900728834 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పెరియార్‌కు ఘన నివాళి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం పెరియార్ వర్ధంతిని నాస్తిక సమాజం జిల్లా శాఖ అధ్వర్యంలో నిర్వహించారు. భారత నాస్తిక సమాజం రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ బోసు బాబు మాట్లాడుతూ.. పెరియార్ కుల, మత రహిత సమాజం కోసం పోరాటాలు చేశా రన్నారు. కార్యక్రమంలో యాదగిరి, వెంకటేశ్వర్లు, మల్లేష్, శరత్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

● విజ్ఞాన, విహారయాత్రకు విద్యార్థులు



మండలంలోని మీర్జాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆదివారం విజ్ఞాన, విహార యాత్రకు లక్నవరం, రామప్ప వెళ్లారు. విద్యార్థులకు క్షేత్రస్థాయిలో చరిత్ర, సంస్కృతి గురించి ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పురాతన రాతి కట్టడాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - హుస్నాబాద్‌రూరల్

సామాన్యుడికి కూర'గాయాలు'



కూరగాయల దుకాణం

నారాయణఖేడ్: కూరగాయల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. వారం క్రితం ఉన్న ధరలకు ప్రస్తుతం ఉన్న ధరలకు పొంతన ఉండటం లేదు. ధరలు తగ్గుతాయని ఎదురుచూస్తున్న జనానికి నిరాశే ఎదురవుతోంది. ధరల పెరుగుదలకు ప్రధాన కారణం స్థానికంగా సాగు తగ్గడమే. అన్నిరకాల కూరగాయలు, ఆకుకూరలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడం ధరల పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. ఏ రకం కూరగాయ ధర చూసినా కిలో రూ. 60 నుంచి రూ. 80 పైమాటే. టమాటా కిలో రూ.30 నుంచి 40 పలుకుతోంది.

ఏటా తగ్గుతున్న సాగు

జిల్లాలో కూరగాయల సాగు ఏటా తగ్గుతోంది. రైతులు వరి, పత్తి తదితర పంటలవైపు మొగ్గుచూపుతుండటంతో కూరగాయలు అరకొరగా సాగవుతున్నాయి. గతంలో ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు విత్తనాలు, అవసరమైన పరికరాలను సబ్సిడీపై ఇచ్చేది. కొన్నేళ్లుగా సబ్సిడీలు నిలిచిపోయాయి. దీంతో సాగుకు చేసేందుకు రైతులు ముందుకు రావడంలేదు. పెరిగిన ధరలకు కళ్లెం వేయాలంటే జిల్లాలో సాగు పెరగాల్సిన అవసరం ఉంది. నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో కూరగాయలు అధికంగా సాగవుతుంటాయి. జహీరాబాద్ ప్రాంతంలో అల్లం, ఆలుగడ్డ సాగు అధికం. నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గంలోని పట్టణాలకు దగ్గరగా ఉండే గ్రామాల్లో ఆయా రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తుంటారు. ప్రభుత్వ పోత్సాహం లేక ప్రత్యామ్నాయ పంటలుగా వరి, పత్తి, సోయా సాగు చేసుస్తున్నారు. నూతన ప్రభుత్వం కూరగాయల రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీలు ప్రకటించడంతోపాటు మండల కేంద్రాల్లో రైతు బజార్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

వెల్లుల్లి అ'ధర'హో..

అల్లం, వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటాయి. కిలో వెల్లుల్లి రూ. 300, అల్లం రూ. 150 నుంచి రూ. 200 పలుకుతున్నాయి. ధరలు పెరగడంతో కిలోకి బదులు పావుకిలో కొనుగోలు చేస్తున్నారు. అల్లం, వెల్లుల్లి ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో స్థానికంగా ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

రోడ్డు పనులకు వైకుంఠధామం నీరు



ట్యాంకర్‌లో నీటిని నింపుతున్న దృశ్యం

కోహెడ(హుస్నాబాద్): కోహెడ- తంగళ్లపల్లి రహదారి పనులకు స్థానిక వైకుంఠధామం నుంచి ట్యాంకర్ ద్వారా అక్రమంగా నీటిని తరలిస్తున్నారు. రోడ్డు పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌తో లోపాయికారి ఒప్పందంతో నీరు తరలింపునకు పంచాయతీ పాలకవర్గం అంగీకరించిందని గ్రామస్తులు ఆరోపించారు. నీటి తరలింపుతో విద్యుత్ బిల్లు చెల్లింపుపై జీపీ నిధులు దుర్వినియోగం కానున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఈవిషయంపై గ్రామ పంచాయితీ కార్యదర్శిని ఫోన్‌లో వివరణ కోరగా విషయం నాకు తెలియన్నారు. కొంత సమయం తర్వాత కారోబార్ నీటి అనుమతికి సంబంధించి రుసుము రసీదు కట్ చేసినట్లు చెప్పడం గమనార్హం.

సంక్షిప్త వార్తలు

◆ క్రీడా దుస్తుల పంపిణీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో ఆదివారం పీఏసీఎస్ డైరెక్టర్ కామల్ల భూమయ్య స్పోర్ట్స్ యూత్ 30 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

◆ నూతన నియామకం



జగదేవ్‌పూర్(గజ్వేల్): పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా బొద్దు నాయక్, ఉపాధ్యక్షుడిగా రంజిత్‌కుమార్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్ శర్మ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్టీయూ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, శేఖర్, రవీందర్, నాగేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

◆ నిరుపేద కుటుంబానికి చేయూత

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని బస్వాపూర్‌కు చెందిన నిరుపేద మాసపాక యాదయ్య కుటుంబానికి ఆదివారం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, బియ్యంతో పాటు రెండు జతల బట్టలు పంపిణీ చేశారు.

◆ ఆర్థిక సహాయం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి లక్ష్మీనర్సింహ స్వామి పురుషుల పొదుపు సంఘం సభ్యుడు బొమ్మిడి నరేందర్ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబానికి పొదుపు సంఘం నుంచి మంజూరైన బీమా, పొదుపు డబ్బులు రూ. 94 వేలు సంఘం అధ్యక్షుడు బొనగం రమేష్ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దూమాల మహేష్, సభ్యులు సంగ రవి, వడ్లూరు సాయిలు, లింగయ్య, నర్సయ్య, భూమయ్య, శ్రీనివాస్, అకౌంటెంట్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని అంతాయిగూడలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన గాండ్ల రమేష్ తన వ్యవసాయ పొలం సమీపంలో ఎద్దు మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి ఎద్దు మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

◆ 5కే రన్‌ను విజయవంతం చేయండి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో ఈనెల 26వ తేదీన వివేకానంద టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 5కే రన్‌ను విజయవంతం చేయాలని సీఐ సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సీఐ మాట్లాడుతూ.. ఈనెల 26 ఉదయం 6 గంటలకు స్థానిక చుంచనకోట చౌరస్తా నుంచి 5కే రన్ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి పోలీస్ సిబ్బందితో పాటు యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ ఓర్వలేకనే విమర్శలు

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యపై విమర్శలు చేయడం మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు తగదని బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మాదాసు అరుణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, అభి, కరుణాకర్, సత్తయ్య, రాములు, స్వామి పాల్గొన్నారు.

◆ ఆర్టిజన్ మృతికి సంతాపం

వర్గల్(గజ్వేల్): మర్కూక్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రభాకర్ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. దీంతో అతడి సొంత గ్రామం వర్గల్ మండలం తున్కిఖాల్సాలో విషాదం అలుముకుంది. సహచర ఉద్యోగులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు చంద్రం యాదవ్, మరాటి కృష్ణమూర్తి, సతీష్, భానుప్రసాద్, రమేష్, మహేష్, చంద్రారెడ్డి, సాయిరెడ్డి, శేఖర్, గోవర్ధన్‌రెడ్డి ప్రభాకర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం డిపార్ట్‌మెంట్ తరపున కుటుంబీకులకు రూ. 20,000 ఆర్థిక సాయం అందజేశారు.

◆ బాల్యమిత్రుడికి అండగా..



దుబ్బాక: ఇటీవల రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన కానుగంటి నర్సింలు మృతి చెందాడు. దీంతో నర్సింలు బాల్య మిత్రులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 19 వేల ఆర్థిక సహాయం అందించారు.